AKSHARA TODAY
# అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
WWW.AKSHARATODAYNEWS.COM
24-6-2026 (Wednesday) MAIN EDITION

## రూ. వెయ్యి కోట్ల విలువైన భూమిని కాపాడిన హైడ్రా



**అక్షరటుడే, హైదరాబాద్:** ఆక్రమణలపై హైడ్రా ఉక్కుపాదం మోపుతోంది. హైదరాబాద్ నగరం పరిధిలో చెరువులు, నాలాలు, ప్రభుత్వ స్థలాలను కబ్జా చెరల నుంచి కాపాడుతోంది. తాజాగా రూ.వెయ్యి కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని హైడ్రా కాపాడింది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం ఖానామెట్ విలేజ్ లోని 5 ఎకరాల ప్రభుత్వ భూమిని హైడ్రా రక్షించింది. సర్వే నంబరు 42లో మెటల్ చార్మినార్ నుంచి హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌కు వెళ్లే మార్గంలో వేసిన రెండు తాత్కాలిక షెడ్లు, ఒక గదితో పాటు ఫెన్సింగ్‌ను తొలగించింది.

## సిరంజీలతో యువతులపై దాడులు



**అక్షరటుడే, నేషనల్‌డెస్క్:** ఫ్రాన్స్‌లో ప్రతి సంవత్సరం ఎంతో ఉత్సాహంగా జరిగే 'ఫేట్ డి లా మ్యుసిక్' సంగీతోత్సవాలు ఈసారి తీవ్ర విషాదానికి దారితీశాయి. లక్షలాది మందితో సందడిగా సాగాల్సిన ఈ వేడుకలు, రాత్రికి రాత్రే హింస, లైంగిక దాడులతో అల్లకల్లోలంగా మారాయి. ముఖ్యంగా రాజధాని పారిస్ నగర వీధులు రణరంగాన్ని తలపించాయి. ఈ ఉత్సవాల్లో అత్యంత దారుణమైన ఘటనలు వెలుగుచూశాయి. రద్దీగా ఉన్న ప్రాంతాల్లో కొందరు దుండగులు మహిళలను లక్ష్యంగా చేసుకుని సిరంజీలతో సూదులు గుచ్చినట్లు తేలింది.

## మద్యం మత్తులో వైర్లపై పడుకుని హల్‌చల్



**అక్షరటుడే, నేషనల్‌డెస్క్:** ఉత్తరప్రదేశ్‌లోని మహారాజ్‌గంజ్‌లో ఓ వ్యక్తి మద్యం మత్తులో విద్యుత్ స్థంభం ఎక్కి హల్‌చల్ చేశాడు. 11కేవీ వైర్లపై అడ్డంగా పడుకుని స్థానికులను భయాందోళనలకు గురిచేశాడు. ఆ సమయంలో కరెంట్ సరఫరా లేకపోవడంతో ప్రాణాలతో బయటపడ్డాడు. పోలీసులు, విద్యుత్ సిబ్బంది అతికష్టం మీద అతడిని కిందికి దించారు.

## తిరుమల శ్రీవారిని దర్శించుకున్న హన్సిక




**అక్షరటుడే, తిరుమల:** ప్రముఖ సినీ నటి హన్సిక మోత్వానీ తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ అధికారులు ఆమెకు స్వాగతం పలికి, దర్శనం అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు. శ్రీవారి ఆశీస్సులు పొందిన అనంతరం ఆమె ఆలయ పరిసరాల్లో కొద్దిసేపు గడిపారు.

## కూటమి సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లండి



**అక్షరటుడే, ఏపీ:** గొడ్డలి పార్టీ చేస్తున్న విష ప్రచారాన్ని, ఫేక్ వార్తలను సమర్థవంతంగా తిప్పికొట్టాలని మంత్రి నారా లోకేశ్ టీడీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. అదే సమయంలో కూటమి ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి-సంక్షేమ ఫలాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని సూచించారు. విపక్షం లో ఉన్నప్పుడు ఎలా ఉన్నామో, ఇప్పుడూ అదే స్ఫూర్తితో ఉండాలని స్పష్టం చేశారు.

## ముంబైని ముంచెత్తిన వర్షాలు



**అక్షరటుడే, నేషనల్‌డెస్క్:** ముంబైలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. రాత్రంతా కురిసిన కుండపోత వానలతో దక్షిణమధ్య, పశ్చిమ ముంబైలోని కొన్ని ప్రాంతాలు అతలాకుతలం అయ్యాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. నగరంతో పాటు పొరుగున ఉన్న పాల్ఘర్ జిల్లాలో ఉరుములు, మెరుపులతో వర్షం పడింది. గంటకు 40 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో వీచే గాలులతో కూడిన తీవ్రమైన లేదా అత్యంత తీవ్రమైన వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ 'రెడ్ అలర్ట్' జారీ చేసింది. భారీ వర్షాలతో అంధేరి సబ్‌వే, హింద్‌మాతా జంక్షన్, దాదర్, గాంధీ మార్కెట్, మలాడ్ సబ్‌వే వంటి లోతట్టు ప్రాంతాలు జలమయమై, ట్రాఫిక్ నిలిచిపోయింది.



పార్టీ ఎమ్మెల్యేలు, నేతలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియలో ఎమ్మెల్యేల నిర్లక్ష్యంపై మండిపడ్డారు. ఈ విషయంలో ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదని, వారం రోజుల్లో పనితీరు మార్చుకోకుంటే ప్రత్యామ్నాయాలు చూస్తామని హెచ్చరించారు. పార్టీ కోసం పనిచేయని వారికి స్థానం లేదని స్పష్టం చేశారు.

- అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి

# ఎమ్మెల్యేలపై సీఎం ఆగ్రహం

- ఎస్ఐఆర్ విషయంలో నిర్లక్ష్యం చేస్తే సహించం
- తీరు మార్చుకోవాలని పలువురికి సూచన
- ఓట్ల తొలగింపు విషయంలో అప్రమత్తంగా ఉండాలి
- ముఖ్య నేతలతో ముఖ్యమంత్రి రేవంతరెడ్డి జూమ్ మీటింగ్

రాష్ట్రంలో రేపటి నుంచి ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రారంభం కానుంది. ఈ క్రమంలో సీఎం రేవంత్ రెడ్డి బుధవారం ఉదయం ఎమ్మెల్యేలు, ఎంపీలు, కీలక నేతలతో జూమ్ మీటింగ్ ద్వారా సమీక్ష నిర్వహించారు. సమావేశంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఏఐసీసీ ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్ పాల్గొన్నారు. సీఎం మాట్లాడుతూ 'సర్' విషయంలో ప్రతిపక్షాల కంటే వెనుకబడడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారంలో ఉన్న మనం వెనుకబడి ఉంటే, నామమాత్రంగా ఉన్న బీజేపీ కూడా నియోజకవర్గాల్లో భారీగా సమావేశాలు నిర్వహిస్తోందని గుర్తుచేశారు. ఎమ్మెల్యేల పనితీరును తాము నిశితంగా గమనిస్తున్నామని, జిల్లాల వారీగా డేటా అంతా సేకరిస్తున్నామని హెచ్చరించారు. ఇన్‌ఛార్జి మంత్రులు ఈ ప్రక్రియలో పూర్తి బాధ్యత తీసుకోవాలని సూచించారు.

### అప్రమత్తంగా ఉండాలి

ఎస్ఐఆర్ చాలా సీరియస్ అంశమని, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లు మరింత అప్రమత్తంగా ఉండాలని సీఎం సూచించారు. కొందరు నాయకులు నిర్లక్ష్యంగా ఉంటున్నారని, పార్టీకి నష్టం జరిగితే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. కాంగ్రెస్ తరఫున మరిన్ని సదస్సులు నిర్వహించాలని ఆదేశించారు. పేదల ఓట్లు పోతే ఆధార్, రేషన్ కార్డులు పోతాయన్నారు. వాళ్లకు అన్యాయం జరగనివ్వొద్దని సూచించారు. పార్టీ ఆదేశాలు పట్టించుకోని వారి స్థానంలో మరొక ఇన్‌ఛార్జిని నియమిస్తామన్నారు.

### ఎమ్మెల్యేల నిర్లక్ష్యంపై టీపీసీసీ చీఫ్ ఆగ్రహం

సమావేశంలో టీపీసీసీ చీఫ్ మాట్లాడుతూ.. అనేక మంది ఎమ్మెల్యేలు ఎస్ఐఆర్ ప్రక్రియను తేలికగా తీసుకుంటున్నారని అసహనం వ్యక్తం చేశారు. పార్టీ బలానికి పునాది అయిన ప్రతి ఓటును కాపాడడంలో ఎమ్మెల్యేలు చొరవ చూపాలని ఆయన స్పష్టం చేశారు. గడువులోగా పనితీరు మెరుగుపరుచుకోవాలని అధిష్టానం కఠిన సంకేతాలు పంపిందన్నారు. కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉన్న ఓట్లను తొలగించే అవకాశం ఉందని, కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతి అర్హత కలిగిన ఓటు జాబితాలో ఉండేలా పార్టీ శ్రేణులు చర్యలు తీసుకోవాలన్నారు.

## కర్ణాటక అక్రమ ప్రాజెక్టులను అడ్డుకోవాలి



**అక్షరటుడే, హైదరాబాద్:** తుంగభద్ర జలాల్లో తెలంగాణ హక్కులను తాకట్టు పెట్టే కుట్రలను తక్షణమే విరమించాలని మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. కర్ణాటక అక్రమ ప్రాజెక్టులను అడ్డుకుని ఆర్డీఎస్, తుమ్మిళ్ల, భీమా ప్రాజెక్టుల ప్రయోజనాలను కాపాడాలన్నారు. సమైక్య పాలనలో తెలంగాణకు జరిగిన అతిపెద్ద అన్యాయాల్లో నీళ్ల దోపిడీ ఒకటని హరీశ్‌రావు పేర్కొన్నారు. కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణకు రావాల్సిన వాటాను దశాబ్దాల పాటు దోచుకోవడంతో లక్షల ఎకరాలు బీడు భూములుగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రం ఏర్పాటు అయ్యాక బీఆర్ఎస్ ప్రభుత్వం గోదావరి, కృష్ణా జలాలను తెలంగాణ భూములకు మళ్లించి కరవును పారద్రోలి, పాలమూరు వంటి వలసల జిల్లాలను పచ్చని పంటలతో కళకళలాడేలా చేసిందని పేర్కొన్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణ జల హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యతను విస్మరించి, రాష్ట్ర ప్రయోజనాలను పక్క రాష్ట్రాల వద్ద తాకట్టు పెడుతోందని ఆరోపించారు.

## జేడీ వాన్స్ ప్రతిపాదనను తోసిపుచ్చిన ట్రంప్



**అక్షరటుడే, నేషనల్‌డెస్క్:** రష్యా-ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన రెండో విడత పాలనలో తీవ్ర ప్రయత్నాలు చేశారు. ఈ క్రమంలోనే ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ చేసిన ఒక వినూత్న ప్రతిపాదన, దానికి ట్రంప్ ఇచ్చిన సమాధానం ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాయి. 'రెజీమ్ ఛేంజ్' పేరుతో ప్రముఖ రచయితలు మ్యాగీ హేబర్‌మాన్, జొనాథన్ స్వాన్ రాసిన పుస్తకంలో ఈ కీలక విషయాలు వెలుగుచూశాయి. యుద్ధ క్షేత్రంలో కాల్పుల విరమణను పర్యవేక్షించేందుకు ఐరోపాయేతర దేశాల నుంచి దళాలను పంపాలని సూచిస్తూ, భారత్, సౌదీ అరేబియా పేర్లను ప్రతిపాదించారు. కానీ, వాన్స్ ప్రతిపాదనను ట్రంప్ సున్నితంగానే తిరస్కరించారు. "భారత ప్రధాని మోదీతో నాకు చాలా బలమైన అనుబంధం ఉంది. ఆయన నన్ను ఎంతగానో అభిమానిస్తారు. కానీ, భారత్ ఎప్పటికీ ఇందుకు అంగీకరించదు. ఇలాంటి అంతర్జాతీయ వివాదాల్లో జోక్యం చేసుకుని అనవసరంగా మూల్యం చెల్లించుకోవాలని భారత్ అనుకోదు" అని ట్రంప్ స్పష్టం చేసినట్లు పుస్తకంలో వివరించారు.

## రామ్ చరణ్‌పై మోదీ ప్రశంసలు..




**అక్షరటుడే, సినిమాడెస్క్:** టాలీవుడ్ గ్లోబల్ స్టార్ రామ్ చరణ్‌పై భారత ప్రధాని నరేంద్ర మోదీ చేసిన ప్రశంసలు ఇప్పుడు టాలీవుడ్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. ఇటీవల రిపబ్లిక్ టీవీ నిర్వహించిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న ప్రధాని మోదీ.. రామ్ చరణ్‌ను "న్యూ ఏజ్ మెగాస్టార్" అని కొనియాడారు. ఈ విషయాన్ని మెగాస్టార్ చిరంజీవి ఒక తండ్రిగా ఎంతో గర్వంగా భావిస్తూ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. తన కుమారుడికి దక్కిన ఈ గౌరవం పట్ల చిరంజీవి సుమతీ శతకంలోని "పుత్రోత్సాహము తండ్రికి పుత్రుడు జన్మించినపుడు పుట్టదు, జనులా పుత్రుని గనుగొని పొగడగా, పుత్రోత్సాహంబు నాడు పొందుర సుమతీ!" అనే పద్యాన్ని ప్రస్తావిస్తూ తన సంతోషాన్ని వ్యక్తం చేశారు. కుమారుడు పుట్టినప్పటి కంటే, సమాజం అతడిని మెచ్చుకుంటున్నప్పుడే తండ్రికి నిజమైన ఆనందం కలుగుతుందని ఆయన పేర్కొన్నారు.

## ఢిల్లీలో భారీ అగ్నిప్రమాదం..



**అక్షరటుడే, ఢిల్లీ:** ఢిల్లీలోని ఉద్యోగ్ భవన్ సమీపంలోని మురికివాడలో భారీ అగ్నిప్రమాదం జరిగింది. 20 ఫైరింజన్లతో సిబ్బంది మూడు గంటలు శ్రమించి మంటలను అదుపు చేశారు. ఢిల్లీలోని సెంట్రల్ విస్టా పునరాభివృద్ధి ప్రాజెక్టుకు సంబంధించిన కార్మికులు నివసిస్తున్న ఒక కార్మిక నివాస సముదాయంలో బుధవారం తెల్లవారుజామున భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఈ మంటలు నివాస సముదాయం అంతటా వేగంగా వ్యాపించడంతో అగ్ని మాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలు ఆర్పివేశారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా ఈ అగ్నిప్రమాదం జరిగి ఉంటుందని అనుమానిస్తున్నారు. ఈ ఘటనలో కనీసం 30 గుడిసెలు, పెద్ద మొత్తంలో ప్లైవుడ్, కలప కాలిపోయాయి.

## నకిలీ నంబర్ ప్లేట్లపై పోలీసుల ఉక్కుపాదం



**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ:** హైదరాబాద్ నగరంలో పలువురు తమ వాహనాలకు నకిలీ నంబర్ ప్లేట్లు ఏర్పాటు చేసుకుంటున్నారు. ట్రాఫిక్ చలాన్ల నుంచి తప్పించుకోవడానికి ఫేక్ నంబర్ ప్లేట్లు వినియోగిస్తున్నారు. దీంతో నగర పోలీసులు కఠిన చర్యలు చేపట్టారు. ప్రజల నుంచి అందిన ఫిర్యాదుల మేరకు, నకిలీ, మార్పులు చేసిన లేదా అనధికృత రిజిస్ట్రేషన్ నంబర్ ప్లేట్లను ఉపయోగిస్తున్న వాహనాలపై హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు తనిఖీలను ముమ్మరం చేశారు. వారం రోజుల్లో మెహదీపట్నం, మహంకాళి, టోలీచౌకి, గుడిమల్కాపూర్, అంబర్‌పేట్, ఛత్రినాక, సంతోష్‌నగర్, సనత్‌నగర్ మరియు సైఫాబాద్ వంటి వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో 10 క్రిమినల్ కేసులు చేశారు.

## తెలంగాణ కొత్త సీఎస్‌గా సంజయ్ జాజు!



**అక్షరటుడే, హైదరాబాద్:** తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా ఐఏఎస్ సంజయ్ జాజును నియమించనున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఆయన కేంద్ర సర్వీస్‌లో పని చేస్తుండగా రాష్ట్రానికి పంపాలని తెలంగాణ ప్రభుత్వం కోరింది. ఈశాన్య ప్రాంతాల అభివృద్ధి కార్యదర్శిగా పనిచేస్తున్న సంజయ్ జాజును కేంద్రం మంగళవారం రిలీవ్ చేసింది. ప్రస్తుత సీఎస్ రామకృష్ణారావు ఈ నెలాఖరున పదవీ విరమణ చేయనున్నారు. దీంతో కొత్త సీఎస్ నియామకంపై ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. రాష్ట్రంలోని సీనియర్ అధికారుల జాబితాను పరిశీలిస్తోంది. కొత్త సీఎస్‌గా సంజయ్‌జాజుతో పాటు జయేశ్‌రంజన్ పేర్లను ప్రభుత్వం పరిశీలించినట్లు సమాచారం. సీఎం రేవంత్‌రెడ్డి జాజు వైపే మొగ్గు చూపినట్లు తెలుస్తోంది. సంజయ్ జాజు 1992 బ్యాచ్ ఐఏఎస్ అధికారి. ఆయన విజయవాడ సబ్‌కలెక్టర్‌గా, పశ్చిమగోదావరి కలెక్టర్‌గా, హైదరాబాద్ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్‌గా, కమిషనర్‌గా, పౌరసరఫరాల సంస్థ కమిషనర్‌గా గతంలో పని చేశారు. 2014 నుంచి కేంద్ర సర్వీస్‌లోకి వెళ్లారు. తాజాగా మళ్లీ రాష్ట్రానికి రానున్నారు. దీంతో ఆయనను సీఎస్‌గా నియమించనున్నట్లు తెలుస్తోంది.

## రూ.2 లక్షల లంచం తీసుకుంటూ దొరికిన ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** ఒడిశా రాయగడలోని రూరల్ వర్క్స్ డివిజన్-I ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ప్రసన్న కుమార్ పట్నాయక్ లంచం తీసుకుంటూ దొరికాడు. రూ. 2 లక్షల లంచం తీసుకుంటుండగా ఒడిశా విజిలెన్స్ అధికారులు మంగళవారం రాత్రి ఆయనను అరెస్టు చేశారు. ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ప్రసన్న కుమార్ ఒక కాంట్రాక్టర్ నుంచి రూ. 2 లక్షల లంచం స్వీకరించినట్లు ఆరోపణలున్నాయి. రూ. 50 లక్షల విలువైన పెండింగ్ బిల్లులను క్లియర్ చేయడానికి, కొత్త టెండర్ ప్రక్రియలో పాల్గొనడానికి అవసరమైన పని అనుభవ ధృవీకరణ పత్రాన్ని జారీ చేయడానికి ఈ లంచం అడిగాడు. దీంతో సదరు కాంట్రాక్టర్ విజిలెన్స్ అధికారులను ఆశ్రయించారు. పట్నాయక్ లంచం తీసుకుంటుండగా విజిలెన్స్ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.